సింగిల్ పేజీ కథ

# నీ చారలకో దండం

డా॥ ఎం. హరికిషన్

ఒక అడవిలో ఒక ఎలుగుబంటి వుండేది. అది చానా మొండిది. ఎవరెన్ని మంచిమాటలు చెప్పినా కొంచంగూడా చెవికి ఎక్కించుకునేది కాదు. తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళు అనే రకం.



ఒకసారి ఆ ఎలుగుబంటి నీళ్ళు తాగుతా చెరువులోనికి చూసుకొనింది. తన ఒళ్ళంతా నల్లగా, బొచ్చుతో వుండడం చూసి "ఛ...ఛ... ఈ రూపం ఏమీ బాగాలేదు. ఎవరైనా చూడగానే 'అబ్బ! ఎంత ముచ్చటగుందీ ఎలుగుబంటి' అనేలా తయారుకావాలి అనుకొనింది.

ఆ ఎలుగుబంటికి ఒక చెట్టుకింద ఒక ఉడుత చెంగు చెంగున ఎగురుతా ఆడుకుంటా కనబడింది. అది వీపు మీద మూడు చారలతో ముచ్చటగా ముద్దుముద్దుగా వుంది. వెంటనే ఎలుగుబంటి దాని దగ్గరకు పోయి "ఉడుతా... ఉడుతా... నీ వీపు మీద ఆ అందమైన చారలు భలేగున్నాయి. ఎవరి దగ్గర వేపిచ్చుకున్నావు" అని అడిగింది.

దానికి ఉడుత నవ్వి "ఎలుగు మామా! ఈ లోకంలో ఒకొక్క జీవి ఒకొక్క రకంగా వుంటాది. నేనీ చారలు ఎక్కడా వేపించుకోలేదు. అవి పుట్టుకతోనే వచ్చాయి. జింకకు మచ్చలు, నెమలికి పింఛము, ఏనుగుకు తొండము, నాకు చారలు అలా వచ్చినవే" అని చెప్పింది. కానీ ఎలుగుబంటి దాని మాటలు నమ్మలేదు. కోపంగా దాని తోక పట్టుకొని గాలిలో వేలాడదీసి "మరియాదగా నిజం చెబుతావా... లేక ఇలాగే బండకేసి బాది చంపమంటావా" అని మూతిమీద గట్టిగా ఒక్కటీ పెరికింది.

ఉడుతకు చాలా కోపమొచ్చింది. "దీనికి మంచిగా చెబితే ఏదీ ఎక్కదు. ఇంకోసారి నా జోలికి రాకుండా ఏదో ఒకటి చేయాలి" అనుకొని "ఎలుగుమామా... పొరపాటయింది. నన్ను వదిలెయ్యి. నిజం చెబుతా. ఇదిగో ఈ అడవి పక్కనే అదిగో అక్కడ దూరంగా కనబడుతోందే... ఆ వూరిలో రంగయ్య అని ఒక కమ్మరాయన వుంటాడు. ఆయనే నాకీ చారలు పెట్టినాడు" అని చెప్పింది.

"అదీ సంగతి. అలా చెప్పు. తంతేతప్ప ఎవడూ నిజం చెప్పడు ఈ లోకంలో" అంటూ ఎలుగుబంటి పక్కనే వున్న వూరిలోనికి పోయింది.

అక్కడ ఒకచోట కుమ్మరి రంగయ్య కొలిమి దగ్గర ఏదో పని చేసుకుంటా కనబన్నాడు. ఎలుగుబంటి ఆయన దగ్గరికి పోయి "అనా... అనా... నాక్కూడా ఉడుతకు పెట్టినట్టే వీపు మీద అందంగా మూడు చారలు పెట్టవా" అనడిగింది. దానికి వాడు పకపక నవ్వి "ఓసీ పిచ్చిదానా... ఈ లోకంలో దేని అందం దానిదే. ఒకదానిని చూసి ఇంకొకటి అసూయపడగూడదు. ఐనా నేను ఆ ఉడుతకు ఏ చారలూ పెట్టలేదే" అన్నాడు. కానీ ఎలుగుబంటి వాని మాటలు కొంచంగూడా చెవికి ఎక్కించుకోలేదు. లటుక్కున వాని గొంతు పట్టుకొని "ఏరా... మరియాదగా అడుగుతావుంటే తెగ నీలుగుతున్నావు. చారలు పెడతావా లేక ఇలాగే గొంతు పిసికి ఇక్కన్నే బూంచమంటావా" అని బెదిరిచ్చింది.

దాంతో వాడు "అబద్ధానికున్న విలువ నిజానికి లేదీలోకంలో" అని గొణుక్కొని "సరే పెడతా... కానీ చానా నొప్పిగా వుంటాది. తట్టుకోగలవా" అనడిగినాడు. దానికి ఎలుగుబంటి నవ్వుతా "నా గురించి నీకు తెలీదు. ఆకాశమే విరిగి మీద పన్నా నాకేమీ కాదు. ఐనా ఆ ఉడుతే భరించగా లేనిది నేను భరించలేనా... పెట్టు" అనింది.

రంగయ్య సరే అని బాగా ఎర్రగా కాలిన ఇనుపచువ్వ ఒకటి తీసుకొని దాని వీపు మీద పెట్టి గట్టిగా ఒక్క అదుము అదిమినాడు. అంతే... వీపంతా కిందికీ మీదికీ ఒక్కసారిగా సుర్రుమనింది. అంతే. అది ఆ నొప్పికి తట్టుకోలేక కిందా మీదా పడి లబలబలాడుతా "ఓరి నాయనోయ్.. నొప్పంటే ఏదో మామూలుగా వుంటుందనుకున్నాగానీ ఒక్కదానికే దేవుడు కనబడతా వున్నాడు. ఇంక మూడుగాని పెట్టిచ్చుకున్నానంటే అంతే... సక్కగా ఆ దేవుని దగ్గరికే పోయేటట్టు వున్నాను" అనుకొనింది.

అంతలో రంగయ్య "ఏం ఎలుగుమామా... సిద్ధమేనా... రెండోది పెడతాను" అన్నాడు. వెంటనే ఎలుగుబంటి అదిరిపడి "నాయనోయ్... నొప్పంటే ఏమో అనుకుంటిగానీ మరీ ఇంత నొప్పా...ఈ చారలూ వద్దూ... ఆ అందమూ వద్దు. నీకూ నీ ఇనుపకడ్డీకి ఒక దండం" అంటూ అక్కన్నించి అడవిలోనికి పారిపోయింది.

•